
నట్టనడి ఎండాకాలం, మే నెల మధ్యాహ్నపుటెండ, వీపు చుర్రుమనిపిస్తోంది. ఒంటిమీది చెమట వంటి మీదే ఎండిపోతోంది. వొగురుస్తూ రిక్షా తొక్కుతున్నాడు భిక్షాలు. అది నీటి పీపా రిక్షా. ఆసరికే ఏడెనిమిది ట్రిప్పులేశాడు. ఇంకా పొయ్యాల్సింది ఉంది. ఈసారి ఎండాకాలం నీటి కరువు బానే ఉంది. ఎన్ని నీళ్లొచ్చినా ఇంకా పీపాలు కావాలని అడుగుతూనే ఉన్నారు జనం.

"గవురమ్మ సల్లంగ జూడబట్టి మనబోటోళ్లకు ఈ మాత్రం నాలుగు ట్రిప్పులైనా దొరుకుతున్నాయి. లేకపోతే మనందరం ఏం గావాలే"? అంటుండేవాడు రత్తాలుతో "రత్తి..." గుర్తుకురాగానే భిక్షాలు మొహంపై చిర్నవ్వు మొలిచింది. రత్తాలు చాలా




# నీళ్లబండి భిక్షాలు

పంగులూరి కృష్ణప్రసాద్

క్రైస్ కథోత్సవం - 2006 కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

తెలివైంది. ఎనిమిదో తరగతి దాకా చదివింది. పెళ్ళైనప్పటి నుంచి చదువు రాని భిక్షాలుకు తల్లో నాలుక, బుర్రలో బుద్ధీ అయి భిక్షాలు పెడత్రోవలు పట్టకుండా కాపాడుకొస్తుంది. ఒక్కగానొక్క ఆడపిల్ల పుట్టీ పుట్టగానే పుట్టినరోజు నమోదు చేయించడం దగ్గర్నుంచి, ఆ డాక్టరు దగ్గరకీ ఈ డాక్టర్ దగ్గరికీ తిరిగి వేయాల్సిన మందులూ, టీకాలు వేయించడం, చివరికి బళ్ళో వేయించి చదివించడం దాకా బాధ్యతగా సాకు తోంది.

"నేను మాత్రం ప్రేమతో పెంచ లేదా! గుండెలపైనెట్టుకొని పెంచా" అనుకొన్నాడు భిక్షాలు.

తలగుడ్డతో మొహం తుడుచుకొని రిక్షా వేగం పెంచాడు.

కూతురు గుర్తుకు రాగానే ఆలోచనలు ఆయమ్మిపైకి మళ్లినై "నా బిడ్డ" గర్వంగా అనుకున్నాడు. పుట్టిన కాడి నుంచి గారాబంగా పెంచాడు. చిన్న ప్పటి నుంచి ఇంటి పనుల్లో వాళ్లమ్మ చేతికింద పెరిగి, సాయం చేసి, బడికెళ్లి చదూకునేది. ఎంత తెలివైందో? బడ్నించి తిరి గొచ్చింది లగాయితు ఎప్పుడెప్పుడు అయ్య తిరిగొస్తాడా అనే ద్యాసేగాని ఈడ పిల్లలతో తిరగాలని గానీ, ఆడుకోవాలని గానీ ఏ మాత్రం ఉండేది లేదు. అంత చక్కగా పెంచుకొన్న పిల్ల ఈడుకొచ్చిన దగ్గర్నుంచి భిక్షాలుకు దిగులైపోయింది. రత్తాలు, పిల్ల దాని పెళ్ళి గురించి పోరడం మొదలెట్టింది. "నాకు తెలీదేటి, దాన్ని నా యింట్లో ఇంకొన్నాళ్లు ఉండనీయవా ఏంది? చిన్న పిల్లే గదా ఇంకా? నా తల్లిని రారాజుకిచ్చి చేత్తాన్లే' అని కసిరేసేవోడు. పైకి అలాగన్నా గుండెల్లో గుబులుగానే ఉండేది. దూరమెక్కడ్నో పిల్లనీయాలంటే దిగులై పోయేది. కళ్ళముందు ఉండే మనువైతే బాగుణ్ణు అనుకుంటున్నాడు. అలా అనుకున్నాడో లేదో పెళ్లికొడుకు కుదిరాడు. పదోతరగతి దాకా చదివాడు. బుద్ధి మంతుడే కాకపోతే కన్నోళ్ళే కానులకాశపడ్తున్నారు. బిడ్డ కళ్లముందే ఉంటుందని సంతోషంతో ఉబ్బిపోయాడు భిక్షాలు. పదేనువేలు రొక్కం ఇచ్చి పిల్లను అంప కం చేసేట్టు ఒప్పుకున్నాడు. పిల్లాడు పని మంతుడే కాబట్టి మనువైనాక తన పీపా రిక్షా ఇచ్చి తను తిప్పే మూడు బజార్లలో ఓ రెండు బజార్లు తిప్పుకోమందాం, బిడ్డ కంటి ముందే ఉంటుంది కదా అనుకున్నాడు.

"ఇంత రొక్కం, ఆ పైన పెళ్ళి ఖర్చు, ఏడ్నుంచి తెత్తావు మావా" అని రత్తి ఓ పక్క నుంచి నసుగుతూనే ఉంది.

"ఒసి పోవే ! నా బిడ్డ నాకాడ ఉండాల గాని యాడ్నించైనా తెత్తానే, నువ్వూరుకో" కసిరినట్టే చెప్పాడు.

ఆసరికి ఊరుకుంది రత్తాలు, కానీ రాత్రికి మళ్లా అదే వరస. భిక్షాలు నవ్వుతూ చెప్పాడు "ఒసే రత్తీ ! నీకు బెంగెందుకే, నాకామాత్రం తెలీదనుకున్నావా? వచ్చేది ఎండాకాలమే! రోజుకి పదిహేను ట్రిప్పులైనా పోసి ఎండాకాలం ఎల్లిపోయే నాటికి పదేలు కళ్లజూడనంటే ! కాస్తో కూస్తో నువ్వు కూడ బెట్టినది ఇంకో పదేలు ఉండినై. కట్నానికి ఖర్చులకి అవి సరిపోతై గదా! ఇంక మనోళ్లకి సారా పోయించడానికే గదే, అవే వస్తయిలే !"

అదిగో అప్పటి సంది రెక్కలు ముక్కలు చేసుకుంటున్నాడు భిక్షాలు. కూతురు గుర్తొస్తే చాలు ఎక్కడ లేని ఓపిక వచ్చేస్తుంది.

భిక్షాలు ఆలోచనలకీ, రిక్షాకి బ్రేక్ పడ్డది. ఎదురుగా నెత్తిన పైట గప్పుకొని రత్తాలు.

"యాంది మావా! యాడని ఎతి కేది నిన్ను ? బువ్వకు గూడ రాకపోతివి, ఇట్టా కాసింత నీడకిరా, కాస్త సల్లబడ్డాక ట్రిప్పులు వెయ్యొచ్చు గదా ! చెప్తే యినేటోడివి గాక పోతివి, పదేనువేలు రొక్కం ఒప్పుకుంటివి? ఇట్లా రెక్కలు ముక్కలు జేసుకుని ఎన్నాళ్లు కష్టపడితే అంత రొక్కం అయ్యేనో" అంటూ భిక్షాలు మొహం పైటతో అద్దుతోంది.

"ఒసే! నువ్వూరుకోయే ! మాటకి అదే మాట, ఇప్పుడు గాదులే పో. మాయిటేలవస్తా! ఇంకా పది ట్రిప్పులు కూడా పొయ్యాలే ! ఆ బజార్లో బ్యాంకు సారుకీ, పోస్టుమాస్టర్ గారింట్లో, అయ్యోరింట్లో ఇంకా పొయ్యాల, చుట్టాలొచ్చి నారు. పాపం బాగాఎద్దడైందంట. మనమే గదంటే పొయ్యాల్సింది" విసుక్కుంటూ అని రిక్షాను ముందుకు దూకించాడు.

చూస్తూ ఉంది రత్తాలు. భిక్షాలు మలుపు తిరిగాడు. మళ్ళీ ఆలోచనలు ముసురు కొన్నాయి. "అనుకోకుండా నీళ్ళ కరువు వరంలా వచ్చింది. సిమెంటు రోడ్డు వేస్తూ కొన్ని చోట్ల, వేసిన రోడ్డు పగలగొట్టి డ్రైనేజి గొట్టాలు వేస్తూ మరో చోట, ఎలాగైతేనేం నీళ్లపైపులు దెబ్బ తిన్నాయి. మూడ్రోజులకి ఓసారి ఇచ్చే నీళ్లు కూడా ఇయ్యటం మానేసారు, పైపులు బాగయ్యే దాకా ! దాంతో రోజుకి ఐదారు ట్రిప్పులు తిరిగే తనకు ఇప్పుడు చేతి నిండా పని, అంతా తన బిడ్డ అదృష్టం" మురిసిపోతూ రిక్షా ఆపాడు. మూలనున్న సోడాబండి దగ్గరకు వెళ్లి ఓ సోడా తాగాడు. కొంచెం సత్తువ వచ్చినట్లైంది. ఖాళీ కడుపులో సోడానీళ్లు లుడుకు, లుడుకు మంటున్నై, వగరుస్తూ మళ్లీ రిక్షా ఎక్కాడు భిక్షాలు.

❀ ❀ ❀

రాత్రి ఇంటికి చేరేసరికి పొద్దు పోయింది. బిడ్డ నిద్రపోతోంది. దీవం వెలుతుర్లో బిడ్డ మొహం ఓసారి చూసి లోపలికెళ్లాడు భిక్షాలు. రత్తాలు తలుపుకి చేరబడి ఉంది. అలికిడికి లేచింది. "వచ్చావా మావా, బాగా పొద్దుపోయిందే! పొంతలో వేన్నీళ్లున్నాయి తానం సేసిరా పో ! ఏయాలకాడ తిన్నావు, మళ్లీ ఏయాల కాడ ఇంటికొస్తన్నవు?" తొందరపెట్టింది.

భిక్షాలు నిక్కరు జేబులోంచి డబ్బులు తీసి ముందు పడేశాడు. "ఎంతున్నాయో లెక్కెట్టుహె" అదిలించినట్టే అన్నాడు. రత్తాలు కూర్చుని డబ్బు లెక్కెడుతోంది.

"ఎన్నిట్రిప్పులుమావా?"అడిగింది.

"పాతిక పైనేనే. ఇయాల ఇరవయ్యారు దిరిగినా, ఇంకో నాలుగైదయినా ఏద్దామను కొన్నా, పొద్దుపోయింది, రేపు రమ్మన్నరు. వాళ్లూ పడుకోవాలి గదా !" పొంతలో నీళ్లు తోడు కుంటూ చెప్పాడు భిక్షాలు "అయితే వెయ్యిపైనే రావాల్నే" అంటుంది రత్తాలు. "ట్రిప్పుకి నలభై

లెక్క". "ఎట్టాగే, ఆ చెరువుకాడ ట్రిప్పుకి ఐదేసి రూపాయిలు మామూలు ఇవ్వొద్దే! అయి తీసేసి చూడు" అన్నాడు భిక్షాలు.

"ఎందుకియ్యాల! ఆళ్ళ ఇంట్లో నీళ్ళే మన్నా యిస్తన్నరా యాంది? చెరువులోయే గదా, ఆళ్లకి జీతాలు ఇయ్యట్లే? మన కష్టం గుంజు దేంది?" గయ్యిమంది.

"అసే ఊరుకో ! రోజుకి ఐదారు పీపాలైతే ఊరికనే ఇస్తరంట. అంతకు మించితే టిప్పుకు ఐదేసి ఇవ్వాల్సిందే, గవర్నమెంటోళ్లు. ఆళ్లతో పెట్టుకుంటిమా, ఈ కాసిని కూడా దక్కేది లేదు." సమాధానపరిచాడు భిక్షాలు.

"ప్రపంచికం అట్టాగుందే ! ఆళ్ల జీతాల సంగతి మనకెందుకు? మనం ఎదురు అడిగి నిలిచేటోళ్లమా" గొణుగుతున్నాడు.

రోజూ ఇలాగే రెక్కలు ముక్కలు చేసుకుంటున్నాడు భిక్షాలు. ఆనందంగా డబ్బు కూడుతున్న సంతోషం అతన్ని ఇంకా ఇంకా కష్టపడేలా చేస్తోంది. ఎండకి కమిలిపోతున్నాడు. రాత్రి చల్ల గాలికి తేట పడ్తున్నాడు. ఐదారు రోజులు ఇలాగే గడిచినయి.

❀ ❀ ❀

ఆరోజు భిక్షాలు రిక్షా భారంగా నడుస్తోంది. ప్రొద్దుటి నుంచీ ఎడతెగని ఆలోచన, రిక్షా నడుస్తోంది. ట్రిప్పులు వేస్తున్నాడు. కానీ మనసు మనసులో లేదు. సాయంత్రం అయ్యేకొద్దీ నీరసం ఆవహించింది. ఇక ట్రిప్పులు వేయాలని పించలేదు. ఇంటికెళ్లాలనీ అనిపించలేదు. కొద్దిసేపు అటూ ఇటూ తిరిగాడు. సారాకొట్టు కనిపించింది. బాధతో కడుపు మండింది. గొంతు దిగిన సారాతో గుండె మండింది. ఆ వాసనకి, వెగటు రుచికి కడుపులో తెమిలినట్లైంది. భళ్లున కక్కాడు. నిజానికి భిక్షాలుకు ఏ దురలవాట్లూ లేవు. పెళ్ళైన దగ్గర్నుంచి దాదాపు రోజూ... రత్తాలు రాత్రి భిక్షాలుతో ఒట్టు వేయించు కొనేది. సారాకొట్టుకు మాత్రం వెళ్లనని. చదువుకొన్నది కావడంతో దానివల్ల జరిగే నష్టం తెలుసు రత్తాలుకి.

భిక్షాలుకి రత్తి గుర్తొచ్చింది. గుండెలో యింకా మండింది. భళ్లున మళ్లీ వాంతి చేసుకున్నాడు. రత్తి గుర్తొచ్చాక ఇంక తను తాగలేదు. లేచి వెళ్లబోయాడు.

"అరె ! కక్కుకున్నావా ?" పక్కన ఎవడో!

"నువ్వు మాత్రం తొలిసారిగా కక్కకుం డానే సీసా ఎత్తావా? బావా ?" మరెవడో !

"గురువా ! ఒక్కసారి కక్కోగానే సారా వొగ్గేసి వోడిపోయి ఎల్లిపోతున్నావా? తప్పు ! అలా ఎల్లిపోకూడదు. మనమే గెలవాలి గురువా !" ఇంకెవడో పిలుస్తున్నాడు. భిక్షాలుకి మాటలు వినిపిస్తున్నాయి. మనుషులు మాత్రం కనబడ టంలేదు. రత్తి మాత్రమే కనిపిస్తోంది.

"వద్దు మావా ! నువ్వెప్పుడూ తాగొద్దు ! నా మీదొట్టే !" రత్తి చెబు తున్నట్లుంది.

అంతే ! లేచొచ్చాడు. కాసేపు చెడ తిరిగాడు.ఎంత తిరిగినా అదే బాధ. రేపట్నుంచి నీళ్లిస్తారట ! ఏం చేయాలి ! పైపులు బాగు చేశార్ట. తన బిడ్డ పెళ్లి ఎట్లా చేయడం?తనేం కావాలి? ఘనంగా పదేనువేలిస్తానని బీరాలు పలికితినే ! ఏమిటి చేయడం?ఇంకొక్కవారం పైపులు బాగు కాకుంటే బాగానే ఉండేది, కానీ రేపట్నించి నీళ్లిస్తారని ఖణీగా తెల్సింది.

బిడ్డ పెళ్లి, తను ఘనంగా చెప్ప డం, రత్తాలు వద్దని వారించడం, తను కసురుకోవడం, రీలు తిరిగినట్లు గిర్రున తిరుగుతున్నాయి. ఇంటికెళ్లాడు. ఏమీ మాట్లాడలేదు. రత్తాలు ఆశ్చర్య పోయింది. "ఇట్టా ఉన్నాడేంటి?" అను కుంది. "పాణం బాగు లేదో ఏందో?" అను కుని సర్ది చెప్పుకుంది.

అన్నం తిని పడుకున్నాడన్నమాటే గాని నిద్రపట్టలేదు భిక్షాలుకి. అటు ఇటు మెసులుతూనేఉన్నాడు. మళ్లీ ముసురుకున్నాయి ఆలోచనలు. సాయంత్రం షావుకారు గారింటికి వెళ్లాడు అప్పుకోసం. ఇవ్వనన్నాడు. బండి పెట్టుకునైనా ఇవ్వ మనిబ్రతిమలాడాడు. "నీ బండి నాకెందు కురా ! నేనేమైనా బాడుగకి తిప్పు కుంటానా! సొమ్ములేమైనా ఉంటే పట్రా!" అన్నాడు షావుకారు బొజ్జంతా కదిలేలా నవ్వుతూ ! సొమ్ములు తనదగ్గరెక్కడివి ? తనకున్న సొమ్ము బండే కదా ! పిల్ల పెళ్లి కోసమయ్యా అని బ్రతిమలాడితే చివరికి బండి పెట్టుకుని రెండు వేలిస్తానన్నాడు షావుకారు. అనహానంగా దొర్లాడు. "రెండువేలు?" నవ్వొచ్చింది భిక్షాలుకి. ఇదే ఎద్దడి రెండ్రోజులుంటే ఆ రెండువేలు ఈ బండితోనే సంపా దించుకోగలడు. తనలో తానే గొణుక్కున్నాడు. ఒకసారి... ఇంకోసారి... మరోసారి.

ఓ నిర్ణయానికి వచ్చినట్లు ప్రక్క మీంచి లేచి ఓ గోనెసంచి, గడ్డపలుగు అందుకున్నాడు, బయల్దేరాడు. చీకట్లో స్థిరంగా అడుగులు వేయసాగాడు. ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్లు నడుస్తున్నాడు. కళ్ల ముందు పిల్ల పెళ్లి కనబడు తోంది. ఏదో చేసేయాలి అన్న తెగింపు



విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీవారి వేమూరి అనిల్ కుమార్ స్వాతి వేదికపై సాహితీ కిరీటి పన్యారం సాంబశివరావుకు వజ్రోత్సవ స్వాతంత్ర్య విశిష్ట పురస్కారాన్ని అందజేస్తున్న పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు, సాహితీ విమర్శకులు డా॥ద్వా.నా.శాస్త్రి, మానస అకాడమీ అధ్యక్షులు సి.హెచ్.వి.యస్. బ్రహ్మానందరావులు చిత్రంలోఉన్నారు.

ముందుకు నడిపిస్తోంది. పెళ్లి ఆగిపోయి బిడ్డ కంటనీరు పెడితే తను చూడ్లేడు.

"ఎటు వెళ్లాలి?" ఆలోచించాడు. "ఊరంతా నీళ్లొస్తే నాకేం? నేను నీళ్లు పోసే మూడు వీధులకు నీళ్లు రాకుంటే చాలు" అనుకున్నాడు. అక్కడికే దారి తీసాడు. ఓమూలగా వెలుతురు పడనిచోటు ఎంచుకున్నాడు. తవ్వడం మొదలు పెట్టాడు. మనిషి లోతున ఉంటాయి ఆ పైపులు. పలుగుతో చకచకా గొయ్యి తవ్వు తున్నాడు. "ఎవరైనా చూస్తే...?" ఫరవాలేదు. ఎందుకంటే రాత్రిళ్లు దొంగ తనంగా పనివాళ్లతో గొయ్యి తీయించి ఇంట్లోకి నీళ్లు వచ్చే పైపు సైజులు తెల్లారేలోగా మార్పిం చేసుకోవడం రివాజే! "ఎవరైనా చూసినా అదే అనుకుంటారు" అని ధీమాగా అనుకున్నాడు భిక్షాలు.

గొయ్యి తవ్వడం పూర్తి చేశాడు. నీళ్లపైపు చేతికి తగిలింది. తడిమి చూశాడు. అంత చీకట్లోను కళ్లలో ఏదో తెలీని కసి మెరిసింది. గడ్డ పలుగుతో ఎత్తి గట్టిగా పోటు పొడిచాడు. 'ఠంగ్' పెద్దగా శబ్దం అయ్యింది. కొంచెం పైకి లేచి రోడ్డు మీదకు చూశాడు. ఎవరూ లేరు మళ్లీ 'ఠంగ్' ఒక్కచోట సరిపోదు. మళ్లా రెండు మూడు రోజులు బాగు కానంత తూట్లు పొడవాలి. ఆ తర్వాత గొయ్యి పూడ్చేసి తనదారిన తాను పోతే చాలు.

"ఠంగ్"

దగ్గర్లో పహారా కాస్తున్న కాని స్టేబుల్ చెవినబడ్డది. "ఏంటాశబ్దం?" చెవులు రిక్కించాడు.

మళ్లీ "ఠంగ్!" అనుమానం వచ్చింది కానిస్టేబుల్‌కి. "ఎవరో తాళం పగులకొడుతున్న శబ్దంలా ఉంది" అనుకున్నాడు కానిస్టేబుల్.

టార్చిలైటు ఫోకస్ చేస్తూ నెమ్మదిగా వెతుకుతూ వస్తున్నాడు. "వచ్చిన పని అయి పోయినట్లే" అనుకున్నాడు భిక్షాలు. నెమ్మదిగా తల పైకెత్తి చూశాడు. వీధి మొదట్లో టార్చిలైటు వేసుకుంటూ ఇల్లిల్లూ వెతుక్కొంటూ వస్తున్న కాని స్టేబుల్ కనిపించి గుండె గుభిల్లుమంది. కాళ్లు చల్లబడ్డాయి.

"ఇప్పుడేంటి చేయడం?" ఒక్క సారిగా మైకంలోంచి వాస్తవంలో కొచ్చి నట్లైంది. "దగ్గరకొచ్చి నన్ను చూసినా డంటే రేపు తలెత్తుకొని తిరిగేదెట్లా? జైల్లో తోస్తే నా బిడ్డ మనువు ఏంగాను?" ఆలోచిస్తున్నాడు. "పారిపోదామా అంటే వేరే దారి లేదు, పారిపోయినప్పుడు చూసి కర్ర విసిరినా, అరిచి కేకలేసినా దొరికి పోతానే? ఏం చేయాలి?" భిక్షాలుకు ఏమీ పాలుపోవట్లేదు.

కళ్లముందు రత్తాలు, పెళ్లి కూతురులా బిడ్డ కనిపించారు. కానిస్టేబుల్ దగ్గరకొస్తున్నాడు. గోనెసంచి తీసి ముసుగేసుకున్నాడు భిక్షాలు. కానిస్టేబుల్ గొయ్యిదాకా రానే వచ్చాడు. గొయ్యిలోనే అలికిడి అవుతోందని అర్థమయ్యిం దతనికి. "ఎవర్రా అది?" దగ్గరకు వస్తూనే అడిగాడు. గోతిలోవల్నుంచి సమాధానం రాలేదు. దగ్గరదాకా వచ్చాడు. గొయ్యిలోకి తొంగిచూశాడు. అంతే కళ్లలోకి విసురుగా వచ్చి పడింది మట్టి.

భిక్షాలు కానిస్టేబుల్ మెడ అందుకొని గోతిలోకి లాగాడు. కానిస్టేబుల్ వీపు మీద ఎక్కి గోతిలోంచి బైటపడి పరుగు లంకించు కున్నాడు. ఎటు పరిగెడుతుందీ తెలియరాలేదు. ముసుగు ఎగిరిపోకుండా గోనెను గట్టిగా పట్టుకుని పరిగెడుతున్నాడు. కానిస్టేబుల్ తేరుకుని వెంటపడ్డాడు. విజిల్ వేస్తూ వెంట పడుతున్నాడు. భిక్షాలు చుట్టూ చూసి ఉలిక్కి పడ్డాడు. "ఇటెందుకొచ్చాను?" ఖంగారు పడ్డాడు. అక్కడే పైపులు బాగుచేస్తున్నారు. రోడ్డుకిరువైపులా గోతులు. "పనిచేసే వాళ్లు కూడా ఇక్కడే ఎక్కడో ఉండి ఉంటారు. వాళ్లు కూడా వెంటబడితే దొరికిపోవటం ఖాయం!" భయపడ్డాడు. మొండిధైర్యం ఆవహించింది. "ఎలా తప్పించుకోవడం?" ఆలోచించాడు. "రెండు వీధులు దాటితే బైపాస్ రోడ్డు. అది దాటితే పెద్ద పెద్ద షాపులు, వాటిముందు ఎంతోమంది అరుగుల మీద పడుకొని ఉంటారు. వాళ్లతో కలిసిపోతే ?"

దారి దొరికినట్లైంది. వెంటనే అటు పరిగెత్తాడు. కానీ అంతలో అనుకున్నంతా అయ్యింది. వెంట తరుముతూ వస్తున్న కానిస్టేబుల్ విజిల్‌కు అప్రమత్తమయ్యారు దూరంగా ఉన్న మెకానిక్‌లు. కానిస్టేబుల్ వెంటనే "ఒరేయ్ ! పక్కన శివాలయం వీధిలో పైపులు పగులకొట్టి పారిపోతున్నాడు వాడే! పట్టుకోండి! మీరు ఓ పక్క బాగు చేస్తుంటే వాడు మరోపక్క పైపులు పగులగొడుతున్నాడు దొంగ లం...కొ... పట్టుకోండ్రా!" కుక్కల్ని ఉసి గొల్పినట్టు రెచ్చగొడుతున్నాడు పోలీసు.

అంతా భిక్షాలు వెంట పడ్డారు. రొప్పు తున్నాడు భిక్షాలు. రిక్షా తొక్కే అలవాటుంది కానీ పరిగెట్టడం వీలు కావడం లేదు. గసపెడు తున్నాడు అయినా పరిగెట్టాలి. ముసుగు జాగ్రత్తగా పట్టు కొన్నాడు.

"ముసుగు తొలిగితే ఇంకేమైనా ఉందా ! తను, రత్తాలు, బిడ్డ తలెత్తి నిల్చోగలమా!" భయమేసింది భిక్షాలుకి. పశ్చాత్తాపం కలిగింది. ఎందుకు చేశానా!! అనిపించింది. కానీ ఇది కాదు సమయం? దొరికానా ! కండకు కండ చీరేస్తారు." పరిగెడుతున్నాడు. రెండు వీధులు దాటాడు. బైపాస్ రోడ్ వచ్చే సింది. ఇది దాటెయ్యగల్గితే తప్పించు కున్నట్లే.

నాలుగు లైన్ల హైవే! పరుగెత్తుతూ రోడ్డు మీది కెళ్లాడు. వెంటనే తప్పు చేశానని అర్థమైంది భిక్షాలుకి. 'జిగ్'మని కళ్లల్లో వెలు తురు. ఎటు వెళ్లాలో అర్థం కాలేదు.

కళ్లల్లో టార్చిలైటు పడ్డ కుందేలులా అయిపోయింది పరిస్థితి.

'థన్' విసురుగా గుద్దేసింది ఓ లారీ. ఎగిరి అవతల పడిపోయింది భిక్షాలు శరీరం. ముఖం మీద ముసుగు ఎగిరిపోకుండా పట్టుకున్న పిడికిలి ఇంకా గట్టిగా బిగిసింది.

కానీ ప్రాణం మాత్రం చేతికి దొర కుండా వెళ్లిపోయింది.

**చినుకు మాసపత్రికకు పంపే కథలు అచ్చులో 3 పేజీలకు మించకుండా పంపవలెను.**